క్లుప్తంగా

నీలమణిదుర్గ హుండీ ఆదాయం రూ.2.48 లక్షలు


హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న భక్తులు

పాతపట్నం: స్థానిక నీలమణిదుర్గ అమ్మవారి హుండీ ఆదాయం రూ.2,48,773 వచ్చిందని ఆలయ ఈఓ టి.వాసుదేవరావు సోమవారం తెలిపారు. జిల్లా సహాయ కమిషనర్ కార్యాలయం నుంచి జీవీబీఎస్ రవికుమార్ పర్యవేక్షణలో హుండీ కానుకల లెక్కింపు జరిగిందన్నారు. 30 రోజులకు ఈ ఆదాయం వచ్చిందన్నారు. లెక్కింపులో వెంకటేశ్వర స్వామి సేవా సమితి సభ్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు పరిష్కరించాలి


ఏఈకి వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

సారవకోట: మండల కేంద్రంలోని అఫీషియల్ కాలనీలో గల విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని స్థానికులు సోమవారం గ్రీవెన్స్‌లో ఏఈ రమేష్‌కు ఫిర్యాదు చేశారు. ప్రధాన రహదారి నుంచి వీధిలోకి వెళ్లే రోడ్డు ప్రారంభంలో డ్రైనేజ్‌లో విద్యుత్ స్తంభం వేయడం వల్ల మురుగు నీరు వెళ్లడం లేదన్నారు. వర్షాలు కురిసే సమయంలో ఇబ్బంది పడుతున్నామన్నారు. మరో కచోట వేసిన విద్యుత్ స్తంభం రోడ్డుకు మధ్యలో వేయడం వల్ల వీధిలోకి ఆటోలు, అంబులెన్స్‌లు రావడం లేదన్నారు.

అక్రమ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలి


తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నారాయణమూర్తి

పాతపట్నం: ప్రభుత్వ భూములు, అడవులు, చెరువులు, రహదారుల కబ్జాపై చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు బి.నారాయణమూర్తి అధికారులను కోరారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ కిరణ్ కుమార్‌కు ప్రభుత్వ భూములు కాపాడాలని సోమవారం వినతిపత్రం అందజేశారు. పాతపట్నం, అంతరాబ, ప్రహరాజపాలెం, బూరగాం, కొరసవాడ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ స్థలాల్లో అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వాటికి పంచాయతీ అనుమతులు ఇవ్వడం జరుగుతున్నాయని, దీనిపై కలెక్టర్‌కు కూడా ఫిర్యాదు చేస్తామన్నారు.

ఔదార్యం..


ఆటోడ్రైవర్ కుటుంబానికి ఆర్థికసహాయం అందజేస్తున్న పోలాకి గ్రామస్తులు

పోలాకి: మండల కేంద్రానికి చెందిన ఆటో డ్రైవర్ బైరి జయరాం లివర్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఈయనకు పోలాకి గ్రామస్తులు సోమవారం రూ.50 వేల ఆర్థిక సహాయం చేసి కుటుంబానికి అండగా నిలిచారు. ఇటీవల మెదడు సంబంధిత వ్యాధితో మరణించిన డోల కాళిదాసు కుటుంబానికి రూ.45 వేలు అందజేశారు. మజ్జి లక్ష్మీనారాయణ, గ్రామ పెద్దలు లుకలాపు రాంబాబు, ఈసర్ల శ్రీధర్‌నాయుడు(చిన్ని), రెంటికోట త్రినాథరావు, నేతేటి వల్లన్నాయుడు, కరిమి శ్రీను, తూలుగు అశోక్, యందవ హరి, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలి



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ లత

నరసన్నపేట: డిగ్రీ విద్యార్థులు వర్క్‌షాపులను వినియోగించుకొని వీటి ద్వారా నైపుణ్యాన్ని, విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ పి.లత అన్నారు. కళాశాలలో బీసీడీఈ ఆధ్వర్యంలో డిగ్రీ చదువుతున్న మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులకు వర్క్‌షాపును నిర్వహించారు. దీంట్లో సీఎస్సీ, ఇంటర్న్‌షిప్ నిర్వహణ, కావాల్సిన నైపుణ్యాలు, విజ్ఞానాన్ని ఎలా పెంచుకోవచ్చో వివరించారు. అంబేడ్కర్ యూనివర్సిటీ బీసీడీఈ కో ఆర్డినేటర్ అజయ్‌కుమార్, ప్రొగ్రాం కోఆర్డినేటర్ పి.శ్రీవిద్య పాల్గొన్నారు.

● విద్యుత్ స్తంభాన్ని సరిచేశారు



సరుబుజ్జిలి మండలంలోని రొట్టవలస గ్రామంలో వాలిపోయిన విద్యుత్ స్తంభ సమస్యపై అటెన్షన్ ప్లీజ్ శీర్షికతో సోమవారం వార్త ప్రచురితమైంది. దీనిపై ట్రాన్స్‌కో అధికారులు స్పందించారు. వాలిపోయిన విద్యుత్ పోల్‌ను సరిచేశారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

– సరుబుజ్జిలి

● పొంచి ఉన్న ప్రమాదం



మెళియాపుట్టి మండలంలోని పర్లాఖిమిడి– పలాస రహదారిలో అడుగడుగున ప్రమాదాలు పొంచి ఉన్నాయి. మహేంద్రతనయ వంతెన మలుపులో రహదారి కోతకుగురై పెద్ద గొయ్యి ఏర్పడింది. కొన్ని నెలలుగా చాపర జీడిపరిశ్రమల సమీపంలో ఓ పెద్ద రంధ్రం ఏర్పడి ప్రమాదాలకు కారణమవుతోంది. ఇక్కడ ఎటువంటి హెచ్చరిక బోర్డు లేదు. దీనిపై అధికారులు స్పందించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

– మెళియాపుట్టి

● అభినందన



రాష్ట్ర స్థాయి పోటీలకు పాతపట్నం డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ బాలికల పాఠశాలకు చెందిన పది మంది విద్యార్థినులు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ వి.అర్చన సోమవారం తెలిపారు. టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో స్కూల్ గేమ్స్ ఈ నెల 29వ తేదీన నిర్వహించారు. జిల్లా స్థాయి క్రీడా పోటీల్లో పాఠశాలకు చెందిన ఎం.మాధవి, టి.యమున, జి.జ్యోతి, కె.ఇందు, డి.యమున, కె.హరీష, కె.నవ్య, కె.కృపారాణి, కె.షాహితి వివిధ క్రీడల్లో సత్తాచాటారు. విద్యార్థులను పీడీ దుర్గమ్మ, పీఈటీ త్రివేణి, ఉపాధ్యాయులు అభినందించారు.

– పాతపట్నం

ముగిసిన ఈ–పంట నమోదు


ఈ-పంట వివరాలను నమోదు చేస్తున్న వ్యవసాయశాఖ సిబ్బంది

- ఖరీఫ్‌లో సుమారు 96 శాతం పూర్తి
- నేటి నుంచి అభ్యంతరాల స్వీకరణ
- 5, 6 తేదీల్లో పరిష్కారం
- 7న తుది జాబితా ప్రచురణ

నరసన్నపేట: రైతుల పండించిన పంటలకు ప్రభుత్వ పథకాలు, రాయితీలు అందాలన్నా.. పండించిన పంటను విక్రయించాలన్నా ఈ-క్రాప్, ఈకేవైసీ తప్పనిసరి. నరసన్నపేట, పాతపట్నం, ఆమదాలవలస నియోజకవర్గాల పరిధిలో వ్యావసాయ శాఖ సిబ్బంది క్షేత్రస్థాయిలో పంటల నమోదు చేపట్టారు. ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. సుమారు 96 శాతం మేరక ఈ-పంట నమోదు చేపట్టారు. ఈ–పంట నమోదు సెప్టెంబర్ 15 కల్లా పూర్తికావాల్సి ఉండగా.. వరదలు, వర్షాల కారణంగా ఈ ప్రక్రియను 30వ తేదీ వరకు పెంచారు. అక్టోబరు ఒకటి నుంచి మూడో తేదీ లోగా ముసాయిదా జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రకటించి అభ్యంతరాలు స్వీకరిస్తారు. నాలుగైదు తేదీల్లో అభ్యంతరాలు పరిశీలించి చర్యలు తీసుకుంటారు. అక్టోబరు 7వ తేదీన తుది జాబితాను ప్రకటించేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

ఉపయోగాలు..

ఈ–పంట నమోదుతో రైతులు, కౌలు రైతులు ప్రయోజనం పొందనున్నారు. ప్రకృతి వైపరీత్యాలు, ఇతర కారణాల వల్ల పంటలు నష్టపోతే ప్రభుత్వపరంగా అందించే పరిహారం అందుతుంది. పీఎం కిసాన్, అన్నదాత సుఖీభవ పథకం కింద రూ.20 వేల పెట్టుబడి సాయం, పండించిన పంటలను ప్రభుత్వ ధరలకు అమ్ముకోవడానికి వీలు కలుగుతుంది. పంటల బీమా, పంట రుణాలు, సున్నా వడ్డీ వంటి రాయితీలు ప్రభుత్వం నుంచి ఈ–పంట నమోదు చేసుకున్న రైతులకు వర్తిస్తోంది.

ఈకేవైసీ తప్పనిసరి

రైతులు ఈకేవైసీ కూడా చేసుకోవాలి. పంట నమోదు తరువాత ఈకేవైసీ చేస్తేనే ఈ ప్రక్రియ పూర్తి అవుతోంది. ఈ విషయాన్ని రైతులు గుర్తించాలని అధికారులు కోరుతున్నారు. ప్రతీ రైతూ విధిగా వేలిముద్రలు వేయాలి. పొందూరు, పాతపట్నం, హిరమండలం, సరుబుజ్జిలి మండలాలు బాగా వెనకబడి ఉన్నాయి.

నరసన్నపేట నియోజకవర్గంలో ఈ-పంట (ఎకరాల్లో), రైతుల వివరాలు..

మండలం	ఈ–పంట నమోదు	ఈకేవైసీ చేసుకున్న రైతులు
నరసన్నపేట	18,425	10,621
పోలాకి	19,416	11,183
సారవకోట	18,035	9,264
జలుమూరు	20,379	12,980
ఆమదాలవలసలో..		
ఆమదాలవలస	11,772	9,465
బూర్జ	13,620	8,885
పొందూరు	12,594	9,470
సరుబుజ్జిలి	11,545	7,601
పాతపట్నంలో..		
మెళియాపుట్టి	21,210	10,819
కొత్తూరు	17,490	10,436
ఎల్.ఎన్.పేట	10,394	8,008
పాతపట్నం	16,892	8,755
హిరమండలం	9,454	5,165

అభ్యంతరాలు చెప్పండి



ఈ –పంటతో పాటు ఈకేవైసీ ప్రక్రియ సోమవారంతో ముగిసింది. మంగళవారం నుంచి రైతుల నుంచి అభ్యంతరాలు స్వీకరించి వాటిని పరిష్కరించే పనులు పూర్తిచేయాలి. 7న తుది జాబితా విడుల చేయడానికి ఏర్పాట్లు పూర్తిచేయాలి. ఈ–క్రాప్ 96 శాతం పూర్తయింది. ఈకేవైసీ కూడా దాదాపు పూర్తిచేశారు.

– రవీంద్రభారతి, ఏడీ, వ్యవసాయశాఖ నరసన్నపేట

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ


మొక్కలు నాటుతున్న ఎంపీపీ కూర్మినాయుడు, రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్

సారవకోట: మొక్కలతో పర్యావరణాన్ని పరిరక్షించవచ్చునని ఎంపీపీ చిన్నాల కూర్మినాయుడు అన్నారు. మండలంలోని వడ్డినవలస గ్రామంలో రడ్డీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ నాటి సంరక్షించాలన్నారు.

రెడ్డీస్ ఫౌండేషన్ డిప్యూటీ మేనేజర్ హరిబాబు మాట్లాడుతూ వాతావరణం కాలుష్యం కారణంగా ప్రస్తుతం స్వచ్ఛమైన గాలి కొనుక్కునే స్థితికి చేరుకున్నామని, కాలుష్య నివారణకు మొక్కలు నాటకపోతే మానవ మనుగడకు తీవ్ర ప్రమాదం వాటిల్లుతుందన్నారు. కాలుష్య నివారణకు పాలథిన్, ప్లాస్టిక్ బాటిళ్ల వాడకాన్ని తగ్గించాలన్నారు. గ్రామంలో టెక్కలి ఐతం ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థులు ఎన్ఎస్ఎస్ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. వ్యవసాయాధికారి వెంకటరావు, రైతు ఇప్పిలి రామ్మోహనరావు, బాల, ఐతం కళాశాల ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ మారుతీ ప్రసాద్, రెడ్డీస్ లేబరేటరీస్ ఏరియా మేనేజర్ తవిటి నాయుడు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీటీసీ సభ్యుడు బుచ్చిబాబు

హిరమండలం: మండలంలోని పలు సమస్యలను పరిష్కరించాలని జిల్లా కేంద్రంలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్‌కు మీ కోసం కార్యక్రమంలో సోమవారం స్థానిక జెడ్పీటీసీ సభ్యుడు పొగిరి బుచ్చిబాబు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ సభ్యుడు మాట్లాడుతూ మండలంలోని సుబలయ ఆర్అండ్ఆర్ కాలనీలో శివాలయం నిర్మాణానికి స్థలం మంజూరు చేయాలని కోరారు. మేజర్ పంచాయతీ హిరమండలం పంచాయతీ కార్యాలయం నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలన్నారు. శిథిలావస్థకు చేరిన నవగూడ ప్రాథమిక పాఠశాల భవనం తొలగించి అదనపు గదులు నిర్మాంచాలని కోరారు. వంశధార నిర్వాసితులకు అదనపు పరిహారాలు కొంతమందికి అందలేదని, పరిహారం పూర్తిస్థాయిలో చెల్లించాలని విన్నవించారు.

పర్యాటక విద్యతో ఉపాధి


గుడ్ల బాబు దంపతులను సత్కరిస్తున్న వి.టి.చౌదరి, తదితరులు

ఆమదాలవలస: పర్యాటక విద్య అధ్యాయనం ద్వారా విద్యార్థులకు భవిష్యత్తులో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభిస్తాయని జిల్లా పర్యాటక అధికారి ఎన్.నారాయణరావు అన్నారు. సోమవారం పట్టణంలోని అశోక స్కూల్‌లో విద్యార్థులతో పర్యాటక క్లబ్‌ను ఏర్పాటు చేశారు. పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.

సేవలకు సత్కారం..

పట్టణానికి చెందిన చిక్కోలు సేవా సంఘం గౌరవాధ్యక్షుడు, ధార్మిక సేవకుడు గుడ్ల అప్పల నరసింహులు (బాబు)కు ఇటీవల గౌరవ డాక్టరేట్ లభించింది. ఈ సందర్భంగా ఆయనను అతిథులు సత్కారించారు.

అశోక పాఠశాల కరస్పాండెంట్ వి.టి.చౌదరి కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. శ్రీశారద రామకృష్ణ సేవా సమితి అధ్యక్షుడు మందపల్లి రామకృష్ణారావు సమన్వయకర్తగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు జి.మహేష్ దేవ్, కె.అప్పలనాయుడు, కె.శిరీష, ఎల్.లక్ష్మణరావు, జి.శారద, జి.శరత్ కీర్తి పాల్గొన్నారు .

విద్యార్థులకు అభినందన


బాలికలను అభినందిస్తున్న కేజీబీవీ సిబ్బంది

పోలాకి: ఇటీవల జరిగిన ఎస్‌జీఎఫ్ స్కూల్ గేమ్స్‌లో గంగివలస కేజీబీవీ విద్యార్థులు వివిధ విభాగాల నుంచి 13 మంది ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ఎస్ఓ శారద సోమవారం తెలిపారు. హాకీలో అండర్–17లో కీర్తిక, గిరిజ, అండర్–19లో చందు, పూజిత, చెస్‌లో అండర్–17లో తేజేశ్వని, నెట్‌బాల్‌లో అండర్–14లో భవాని, అండర్–17లో తేజశ్విని, అండర్–19లో ఎం.భవాని, రగ్బీలో అండర్–14లో రేవతి, అండర్–17లో డి.కావ్య, అండర్–19లో పి.కావ్య, యమున, జ్యోత్స్న రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. బాలికలను పీఈటీ ప్రియాంక, సిబ్బంది అభినందించారు.

క్యాన్సర్‌పై అవగాహన


అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మల్లిబాబు

పొందూరు: స్థానిక లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సిస్టం డిగ్రీ కళాశాలలో సోమవారం పారామెడికల్ విద్యార్థులకు క్యాన్సర్‌పై అవగాహన కల్పించారు. డాక్టర్ మల్లిబాబు మాట్లాడుతూ.. ప్రతిఏటా ప్రపంచ వ్యాప్తంగా 4 లక్షల మందికి ఈ వ్యాధి సోకుతుందని, అందులో మన దేశం నుంచి సుమారు 50 వేల మంది ఉంటున్నారన్నారు. తగిన జాగ్రత్తలు తీసుకుంటే ఈ వ్యాధిని నమయం చేయవచ్చునన్నారు. వడ్డిపల్లి సూర్యనారాయణ, అంకం ధర్మారావు, ఎం.మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

హిరమండలం: పారా లీగల్ వలంటీర్ల నియామకానికి దరఖాస్తులను కొత్తూరు జూనియర్ సివిల్ జడ్జి, మండల న్యాయసేవాధికార సంస్థ అధ్యక్షురాలు ఎస్.మణి ఆహ్వానించినట్లు స్థానిక ఎస్ఐ మహమ్మద్ యాసిన్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదవీరమణ పొందిన ఉద్యోగులు, వయోవృద్ధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు, న్యాయ విద్యార్థులు సేవా దృక్పథం కలిగినవారు, మైత్రీ సంఘ సభ్యులు, వైద్యులు అర్హులన్నారు. అభ్యర్థులు పదో తరగతి, మెట్రిక్యులేషన్ కనీస విద్యా అర్హతలు ఉండాలన్నారు.

కొత్తూరు, భామిని, హిరమండలం మండలాల్లో నివాసితులై ఉండాలన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు రెండు పాస్ ఫొటోలు, ఆధార్ కార్డు, విద్యా అర్హత సంబంధిత పత్రంతో కొత్తూరు కోర్టులో గల న్యాయసేవాధికార సంస్థ కార్యలయలంలో ఉదయం 10.30 నుంచి 5 గంటల వరకు దరఖాస్తులు అందజేయాలన్నారు. వీరికి జీతభత్యాలు, వేతనాలు ఉండవని, స్వచ్ఛందంగా పనిచేయాలని స్పష్టంగా తెలియజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక


బేస్‌బాల్ పోటీలకు ఎంపికైన విద్యార్థులు

పొందూరు: శ్రీకాకుళంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బేస్‌బాల్ పోటీల్లో మండలంలోని లోలుగు కేజీబీవీ విద్యార్థినులు టి.సంతు, ఎస్.కల్పన ప్రతిభ కనబరిచారు. బేస్‌బాల్ అండర్–19 విభాగంలో వీరిద్దరు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ ఆర్.సౌమ్య, వ్యాయామ ఉపాధ్యాయురాలు ఎం.రూపవతి తెలిపారు. అక్టోబర్ 2న ఏలూరులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

కఠినంగా శిక్షించాలి


కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సురేష్‌కుమార్


బూర్జ: తనపై దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని గుత్తావల్లి గ్రామానికి చెందిన సనపల సురేష్ కుమార్ శ్రీకాకుళంలో కలెక్టర్ గ్రీవెన్స్‌లో జిల్లా కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. సెప్టెంబర్ 27వ తేదీన నారాయణపురం జంక్షన్ వద్ద జరిగిన ఘర్షణలో మండలంలోని నీలాదేవిపురం గ్రామానికి చెందిన కోడి గోవిందరావు, మరో ముగ్గురు తనపై దాడి చేశారని, వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో కోర్టును ఆశ్రయిస్తానన్నారు. జిల్లా ఎస్పీకి కూడా విన్నవించడం జరిగిందని సురేష్‌కుమార్ తెలిపారు. ప్రత్యేక అధికారిని నియమించి దర్యాప్తు జరిపించాలని ఎస్పీని కోరానన్నారు. తనకు న్యాయం జరిగేవరకు పోరాటం చేస్తానన్నారు.

భారీ వర్షం


కురుస్తున్న వర్షం

ఎల్.ఎన్.పేట: మండలంలోని పలు ప్రాంతాల్లో సోమవారం కుండపోతగా వర్షం కురిసింది. గత రెండు, మూడు రోజులుగా వేసవిని తలపించేలా ఉక్కపోతతో ఆల్లాడిన ప్రజలకు వర్షం ఉపశమనం కలిగించింది. చీకటి పడిన తరువాత బలమైన ఈదురుగాలులతోపాటు భారీగా వర్షం కురిసింది. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది.

రాజుల చెరువును అభివృద్ధి చేయాలి


ఎమ్మెల్యేకు సమస్యలు వివరిస్తున్న స్థానికులు

నరసన్నపేట: రాజుల చెరువును అభివృద్ధి చేయాలని, పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దాలని స్థానికులు ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తికి విజ్ఞప్తి చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం మీకోసం పేరుతో ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా స్థానికులు గొద్దు చిట్టిబాబు, జామి వెంకటరావు తదితరులు ఎమ్మెల్యేకు వినతిపత్రం అందించారు. తామరాపల్లి, నడగాం, నరసన్నపేటకు చెందిన పలు వీధులకు చెందినవారు తమ సమస్యలపై వినతిపత్రాలు ఇచ్చారు. డీటీ శరత్, ఎంపీడీఓ మధుసూదనరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

పరామర్శ..


భగంతరలో రాజు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న రెడ్డి శాంతి

పాతపట్నం: మండలంలోని బగంతర గ్రామానికి చెందిన వంద్రాడ రాజు ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ఆ కుటుంబాన్ని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డిశాంతి సోమవారం పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. బురికిపేట గ్రామానికి చెందిన లాబర పోతయ్య ఇటీవల మృతి చెందాడు. పోతయ్య ఇంటికి వెళ్లి రెడ్డి శాంతి పరామర్శించారు. పరామర్శించిన వారిలో ఎంపీపీ దొర సావిత్రమ్మ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ప్రదీప్, నాయకులు పనుకు మోహన్, తూలుగు ప్రవీణ్, దంపూరం రాజ్యలక్ష్మి, తిరుమలరావు, జి.రాము పాల్గొన్నారు.

డ్వాక్రా బజార్ ప్రారంభం


డ్వాక్రా బజార్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ఆమదాలవలస: పట్టణంలోని చేపల మార్కెట్ సమీపంలో మెప్మా ఆధ్వర్యంలో స్వయం సహాయక సంఘ సభ్యులు ఏర్పాటు చేసిన డ్వాక్రా బజార్‌ను ఎమ్మెల్యే కూన రవికుమార్ సోమవారం ప్రారంభించారు. డ్వాక్రా సంఘాల సభ్యులు ఏర్పాటు చేసిన స్టాల్స్‌ను పరిశీలించారు.

ఆన్‌లైన్ ద్వారా కూడా డ్వాక్రా ఉత్పత్తులను అమ్ముకునే వెసులుబాటు ఉందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ పూజారి బాలాజీ ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత తదితరులు పాల్గొన్నారు.